
కథ

# భార్యామణి



- తమ్మెర రాధిక

కాంతారావు వేదిక మీదకు కులాసాగా ఎక్కుతున్నాడు. భుజం మీద కండువా, బంగారు రంగు ధోవతీ, దాన్ని ఒక అంచు చేత్తో పట్టుకుని కళ్లద్దాలు సవరించుకుంటూ, కార్యకర్త చూపించిన కుర్చీలో దర్జాగా కూర్చున్నాడు. ఎదురుగా కుర్చీల్లో ప్రేక్షకులు అంతా ఆసక్తిగా ఆయన్నే పరికిస్తున్నారు. ఒక నిముషం సభా పిరికి అనిపించినా చిరునవ్వు పెదవుల మీద అతికించుకొని విశ్రాంతిగా ఉండేందుకు ప్రయత్నించాడు.

అది కథావేదిక సభ. అక్కడంతా కాకలు తీరిన రచయితలూ, రచయిత్రులూ వున్నారు. కవులున్నారు, విమర్శకులున్నారు. అందరూ వచ్చారనుకున్నాక సభను ప్రారంభించారు. ఈ యేడాది కాంతారావు రాసిన కథ 'భార్యామణి' జాతీయస్థాయిలో ప్రథమ బహుమతి అందుకుంది. మిగతా బహుమతిగ్రహీతలు కూడా వేదిక నలంకరించారు. అధ్యక్షులవారు కథలకు బహుమతి ప్రదానం చేస్తూ, వారి రచనల గురించి చెప్పమన్నారు.

కాంతారావు వంతు వచ్చింది. జారిపోతున్న చిరునవ్వును మునిపంట నొక్కి, కళ్ల చివర్లతో అందర్నీ ఓ మారు చూసి, "సభాసదులకు నమస్కారం. ప్రేక్షకమహాశయులకు వందనాలు. ఈ కథావేదిక మీంచి బహుమతి అందుకోగలనని నేనెప్పుడూ ఊహించలేదు. ఎన్నో కథలు రాశాను. అవన్నీ వివిధపత్రికల్లో వచ్చాయి. వాటి మీద పలువురు వెలిబుచ్చిన అభిప్రాయాలూ, అభినందనలూ నన్ను ప్రతీ రచన విషయంలో అప్రమత్తుణ్ని చేశాయి. అయితే కథావేదిక ద్వారా మీ అందరిలో ఒకడుగా గుర్తింపు పొందాలని నేను కలలు కనేవాణ్ని. అది ఈ నాడు తీరింది." అతని ఉపన్యాసం అప్రతిహతంగా సాగుతూనే ఉంది.

చీకటి కాటుకలా మారుతోంది. భర్త కోసం ఎదురు చూసి చూసి, విసుగుతో నిద్రొస్తోంది పార్వతికి. అప్పుడే కన్నంటుకుంటోంది... దబదబా తలుపు బాదిన చప్పుడుకు, ఒక్క ఉదుటున లేచివెళ్లి తలుపు తీసింది. మెడలో దండతో, మొహాన నిలువు బొట్టుతో చేతిలో పూల బొకేతో నిలబడున్నాడు భర్త.

"లోనికి రానివ్వే దేభ్యమా!" అతని కసురుతో పక్కకు తొలిగి దారిచ్చింది.

"నాకివ్వాళ సన్మానం చేశారు. మొదలు నిన్ను తీసుకుపోదామనుకున్నాను. కానీ మళ్లీ ఎందుకులే అనిపించి, అట్నుంచటే వెళ్లాను."

ఆమె నించి ఏం సమాధానం లేదు.

"భార్యామణి అని కథ రాశాన్లే పోటీకి. దానికే ఈ సన్మానం..." కారణం లేకుండానే పెద్దగా నవ్వాడు.

పార్వతి లోపలికెళ్లిపోయి నీళ్లు పెట్టింది బాత్రూంలో. అతను స్నానం చేసొచ్చేసరికి బల్ల మీద వేడిగా భోజనం వడ్డించింది.

"నువ్వు తినేడిశావా?" అడిగాడు.

తలూపింది తిన్నానని.

"ఊఁ.. కాసేపాగి చావచ్చుగా... సాంబార్లో ముక్కలన్నీ మింగావా?"

"మీరు కూరగాయలు తేలేదుగా... ఉన్న కాసినీ దాన్లో వేశాను."

"పనోడికి పెట్టినట్టు, నువ్వు తిని నాకు పెడతావేం? రేపట్నించి నే తిన్నాకనే నువ్వు తినాలి. లేదా నేనొచ్చాక రెడీ చెయ్యి భోజనం"

"ఇప్పుడే పది నిముషాలైందండీ తిని. మీ కోసం చాలా సేపు చూసాను".


"ఛత్! వెధవ ముండ సంజాయిషీ నువ్వూను...! నాకెలా సన్మానం చేశారని అడగటం లేదు. ఎవరెలా అభినందించారని తెలుసుకోవడం లేదు. ఎంత సేపూ తింటం, నిద్రపోటం ఛీ...ఛీ...!".

అతని ప్రవర్తనకు కళ్లంబడి నీళ్లు తిరుగుతున్నా, భయంతో బిగుసుకుపోయింది. మర్నాడు కాంతారావు ఆఫీసుకు వెళ్లిపోయాక అతను రాసుకునే రూంలోకెళ్లి కథ అచ్చయిన పత్రిక వెతికి, అక్కడే చదవడం మొదలు పెట్టింది.

"అయ్యో! కాల్లో ముల్లు గుచ్చుకుంది... ఇప్పుడెలా?" అంటూ గుండెలవిసేలా కంగారుపెడతాడు భర్త, భార్య కాలు ఒళ్లో పెట్టుకొని. 'భార్యామణి' కథలో మొదటి వాక్యమది.

సాయంకాలం కాంతారావు ఇంట్లోకడుగుపెడుతూనే ఆశ్చర్య పోయాడు. ముందు హాల్లో పేపర్లూ, చెప్పులూ, మురికి బొమ్మలూ చూసి, 'తనొచ్చే వరకూ ఇల్లు అద్దంలా వుంచేది. ఏవైందబ్బా?' అనుకునేంతలో, "వొచ్చారా ఏంటంత ఆలీసెం అయ్యిందీ? కాస్త తొందరగా వస్తే పిల్లదాన్ని ఆడించుకోవచ్చుగా, నేను పని తెముల్చుకొందును" అంది వొస్తూనే పార్వతి.

భార్య గర్భంతో వున్నప్పుడు ఆమెని కూర్చోబెట్టి రకరకాల వంటలు చేసి, ఆవిణ్ని ఆశ్చర్యంలో ముంచెత్తుతాడు. పుట్టింటికి పంపకుండా తనే ఆమెకు ఒణ్ణింపి, చుట్టుపక్కలవారి పరిహాసాలను కూడా లెక్క చెయ్యడు. ఆడపిల్లను కన్న భార్యను అపురూపంగా చూసుకొనే ఆ హీరోను గురించి చదివి, పార్వతి ఆశ్చర్యపోయింది. ఆడపిల్ల పుట్టిందని ఆరునెల్లు తనను పుట్టింట్లో వదిలి వస్తే, తండ్రి వచ్చాడు, బతిమాలి వెంట తీసుకొద్దామని. ఆయన మొహమ్మీదే తలుపేసుకుని దొడ్డిదోవను వెళ్లిపోయిన భర్తేనా ఈ కథ రాసిందని. బారసాలకు రమ్మనమని ఫోను చేస్తే, పుట్టిన పిల్లని ఎవరికైనా దత్తత ఇవ్వండా రోజని దారుణంగా మాట్లాడిన భర్తేనా ఈ కథ రాసింది!?



కథలో పిల్లకు డెంగూ జ్వరం వస్తే, రక్తం అమ్ముకొని ఆ డబ్బుల్తో మందులు కొని పిల్లను బ్రతికించుకుంటాడు కథా నాయకుడు. ఎన్నడూ ఒళ్లో కూర్చోబెట్టుకొని ఎరగడు భర్త, తన బిడ్డని. నిజజీవితంలో వచ్చిన జీతమంతా బ్యాంకులో వేసుకొని, ఖర్చులకు పార్వతిని పుట్టింటికి పంపిస్తుంటాడు. వారానికోసారి ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే, పిల్లని ముందరేస్తాడు, ఎవరు తిండిపెడతారంటూ. బైట ఆదర్శవాది. ఇంట్లో కర్కశవాది. పుస్తకం మూసి బయటికొచ్చింది, ఆలోచిస్తూ.

కథలో కథానాయిక మౌనంగా వుంటుంది. మంచైనా, చెడైనా అన్నీ అతనే చూసుకుంటాడు. ఇక్కడ తను మౌనంగా వుంటోంది అన్నీ భరిస్తూ. "చూద్దాం ఒక్క నాటకం ఆడి" అనుకుంది.

సాయంకాలం కాంతారావు ఇంట్లోకడుగుపెడుతూనే ఆశ్చర్య పోయాడు. ముందు హాల్లో పేపర్లూ, చెప్పులూ, మురికి బొమ్మలూ చూసి, 'తనొచ్చే వరకూ ఇల్లు అద్దంలా వుంచేది. ఏవైందబ్బా?' అనుకునేంతలో, "వొచ్చారా ఏంటంత ఆలీసెం అయ్యిందీ? కాస్త తొందరగా వస్తే పిల్లదాన్ని ఆడించుకోవచ్చుగా, నేను పని తెముల్చుకొందును" అంది వొస్తూనే పార్వతి.

హాలునూ, భార్యనూ మార్చి మార్చి చూస్తూ, కుర్చీలో కూర్చున్నాడు. అతని వాలకం చూసి పార్వతి లోలోపల వణికిపోయింది.

"ఈ హాలేంటీ? వస్తువులేంటీ? కళ్లకు కనపట్టం లేదా?" ఉరిమా డొక్కసారిగా.

"ఏం చెయ్యాలి...? నా వల్ల కాదు. కాస్త మీరూ సాయం రండి..."

ఆమె మాట ముగియక మునుపే, "ఏంటీ, మాటలు తిన్నగా రావట్లేదూ?" చేతిలో వున్న పుస్తకం ఆమె ముఖం పైకి విసిరేస్తూ అరిచాడు. ఆ పుస్తకం బలంగా ఆమె కంటికి తగిలింది.

"ఏవన్నా అంటే అరుస్తారు. లేదంటే చావబాత్తారు." కంటి వెంబడి ఒస్తున్న నీరు అదుముకుంటూ, "ఇవ్వాళ కథావేదిక వాళ్లు వచ్చారు. వాళ్లతో మాట్లాడుతూ కూర్చునేసరికి లేటయ్యింది. వాళ్లటు వెళ్లారు, మీరిలా ఒచ్చేసతారు. ఇంకెక్కడ సర్దేది?" ఆమె కూడా గట్టిగానే అంది.

"ఆc...?" నోరు వెళ్లబెట్టాడు. "కథావేదిక వాళ్లొచ్చారా? ఏం మాట్లాడారు?"

"మీ వారు కథల్లో రాసినట్టు వుంటారా? లేక విరుద్ధంగా వుంటారా?..."

ఆమె మాట పూర్తి కాకముందే, "ఏం చెప్పి చచ్చావ్‌య" అంటూ అరిచాడు.

పార్వతి ఉగ్రంగా చూసిందతని వైపు.

"చావడం నాకేం ఖర్మ? మాటలు తిన్నగా రానివ్వండి. మీర్రాసిన కథల్లో ఇలాగే వుంటాయా, వాళ్ల బుద్ధులు మీలాగే? వాళ్లు అడిగింది కూడా అదే! అందుకే మీరెలా వుంటారో ప్రత్యక్షంగా చూపిస్తూ కొంచెం ఆగి రండన్నా.."

తెగించిన ఆమె మాటలకు అతనికి గుండాగినంత పనైంది. ఆమెనలా కోపంలో చూస్తే మొదటసారిగా నవ్వొచ్చినా ఆపుకున్నాడు.

మూతి ముందుకు సాగి, కళ్లు చిన్నవిగా చేసి చూస్తోంటే ముచ్చటేసినా, వాళ్ల ముందు ఏం చెప్పుందోనని లోలోపల దిగులు పడ్డాడు. రాత్రి పదైనా ఎవరూ వచ్చే జాడ ఏం కనిపించలా. "పార్వతీ, ఏదీ, ఎవరూ రాలేదేం?"

కాంతారావు అహం కరిగిన హృదయంతో, నిమ్మళంగా అడుగుతుంటే, పార్వతి మనోహరంగా నవ్వింది. ఆ నవ్వులోని నిర్భయనిర్మలత్వాన్ని చూస్తూనే అర్థం చేసుకుని, నిట్టూర్చాడు ఆమె ఆడింది నాటకమని.

●